క్లుప్తంగా

దేవరగట్టులో శ్రావణమాస పూజలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బి.విరూపాక్షి

హొళగుంద: శ్రావణమాసం ఆఖరి ఆదివారం సందర్భంగా మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు మూల విరాట్‌కు జలాభిషేకం, సుప్రభాతసేవ, బండారార్చన, కుంకుమార్చన, మహామంగళ హారతి శాస్త్రోక్తంగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సింహాసన కట్ట ముందు నెరణికి భక్తులు డోలు వాయిస్తూ భక్తిని చాటుకున్నారు. ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి స్వామి వారిని దర్శించుకున్నారు.

నేడు సోమప్ప స్వామి రథోత్సవం

హాలహర్వి: మండలంలోని గూళ్యం గ్రామ వేదావతి నది ఒడ్డున వెలసిన శ్రీ దిబ్బల సోమప్పస్వామి రథోత్సవం సోమవారం సాయంత్రం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. రథోత్సవం కార్యక్రమంలో భాగంగా ఉదయం స్వామి వారికి గంగపూ, పుష్ప, కుంకుమార్చన, మహా మంగళ హారతి తదితర పూజలు నిర్వహించనున్నారు. గూళ్యం, హాలహర్వి, సిద్దాపురం, అమృతాపురం, బాపురం,పచ్చార్లపల్లి తదితర గ్రామాల భక్తులు పాల్గొంటారు.

కబడ్డీ పోటీల విజేత చిట్యాల



చిట్యాల జట్టుకు నగదు బహుమతి అందజేస్తున్న దృశ్యం

కృష్ణగిరి: మండలంలోని పెద్దొడ్డి గ్రామంలో రెండు రోజుల పాటు జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో చిట్యాల జట్టు విజేతగా నిలిచినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆదివారం జరిగిన పోటీల్లో కోడుమూరు మండలం వల్కూరు జట్టుపై చిట్యాల జట్టు గెలుపొందింది. మూడవస్థానంలో తుగ్గలి మండలం నునసరాళ్ల, నాల్గవస్థానంలో ప్యాపిలి మండలం బావిపల్లి జట్లు నిలిచాయని నిర్వాహకులు సురేష్, హరికృష్ణ తెలిపారు. విజేతలకు దాతలు తాడూరు రామాంజనేయులు, వైస్ సర్పంచ్ వెంకటరాముడు, తాడూరు బాలన్న, గ్రామ యూత్ సభ్యులు వరుసగా రూ.10వేలు, రూ.7 వేలు, రూ.4వేలు, రూ.2వేలను అందజేశారు. పోటీల్లో జిల్లాలోని 25 జట్లు పాల్గొన్నాయి.

సిద్ధమైన గణపయ్య ప్రతిమలు



పత్తికొండలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న గణపయ్యలు

పత్తికొండ(తుగ్గలి) : వినాయక చవితిని నియోజకవర్గంలో భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. ఉత్సవాల సందర్భంగా ఆధ్యాత్మికత వెల్లివిరుస్తుంది. ప్రతి గ్రామంలో వినాయక మండపాలు వెలుస్తాయి. వివిధ ఆకృతుల్లో తయారైన విగ్రహాలను తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారు. పండుగ సమీపిస్తుండటంతో కొందరు మండపాల నిర్వాహకులు ఇప్పటికే ప్రతిమల కొనుగోలు కోసం అడ్వాన్స్‌లు చెల్లించారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు



కోయినగర్ ఎంపీపీ పాఠశాల సమీపంలో ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

ఆలూరు రూరల్: కాలం చెల్లిన విద్యుత్ స్తంభాలతో స్థానిక కోయనగర్ కాలనీలో ప్రధాన రహదారిలో ప్రమాదం పొంచి ఉంది. దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన స్తంభాలు నేడు శిథిలావస్థకు చేరాయి. ఎప్పుడు కూలిపోతాయోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గాలి వీచినప్పుడు తీగలు రాసుకుని మంటలు వస్తున్నాయి. కోయనగర్ కాలనీలో విద్యుత్ కార్యాలయం పక్కనే విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. అరికెర,కరిడిగుడ్డం 11 కేవీ, విరుపాపురం రిజర్వాయర్ 11 కేవీ ఫీడర్‌లకు విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి ప్రారంభమవుతుండడంతో వీటికి పవర్ ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రాంతంలో ఒక అంగన్‌వాడీ సెంటర్, ఎంపీపీ పాఠశాలతో పాటు ఎస్సీ బాలికల వసతి గృహం కూడా ఉంది. వర్షాకాలం కావడంతో అవి ఎప్పుడు కూలిపోతాయోనని కాలనీ వాసులు భయపడుతున్నారు. అధికారులు స్పందించి స్తంభాలను మార్చాలని కోరుతున్నారు.

వంతెనలు లేక.. రాకపోకలు సాగక!

- లోతట్టు బ్రిడ్జీలతో ప్రజల అవస్థలు
- వర్షం వస్తే నిలిచిపోతున్న రాకపోకలు
- పొలాలకూ వెళ్లలేకపోతున్న రైతులు, వ్యవసాయ కూలీలు
- పట్టించుకోని యంత్రాంగం





లోతట్టు వంతెనపై రామదుర్గం వంక ప్రవహిస్తుండడంతో నిలిచిన రాకపోకలు (ఫైల్), బ్రిడ్జి లేని బంటణహాలు- ఏరూరు మధ్య పారుతున్న వంక

చిప్పగిరి: మండలంలోని ఏరూరు,రామదుర్గం,దేగులహాలు గ్రామాల సమీపంలో లోతట్టు వంతెనల కారణంగా వర్షాకాలంలో వర్షపునీరు బ్రిడ్జీలను ఎక్కి ప్రవహిస్తుండటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. రామదుర్గం గ్రామంలోకి వెళ్లాలంటే గ్రామం వెలుపల ఉన్న వంక దాటాలి. వర్షాకాలంలో వరదనీరు రోడ్డుపై పారుతుంది. ఆ సమయంలో ప్రజలు గ్రామం విడిచి వెళ్లలేని పరిస్థితి. గ్రామానికి చేరడానికి ఇతర మార్గాలు లేకపోవడంతో గ్రామానికి బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. ఏరూరు – దేగుల హాలు మధ్య ఉన్న బ్రిడ్జీ తక్కువ ఎత్తులో ఉండటంతో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో బ్రిడ్జీ దాటడం సాధ్యం కావడం లేదు. వంకలో వరద నీరు తగ్గే వరకు దేగులహాలుతో పాటు హాలహర్వి మండలంలోని మల్లికార్జునపల్లి,సిరిగాపురం, కొక్కరచేడు గ్రామాల వాహనదారులు వేచి చూడాలి. ఏరూరు– బంటణహాలు గ్రామాల మధ్య వర్షాకాలంలో వంకలో ఉధృతంగా ప్రవహిస్తుంది. వంకపై వంతెన లేకపోవడంతో రెండు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించలేకపోతున్నారు. వరద ఉధృతి తగ్గేంత వరకు ప్రయాణాలు వాయిదా వేసుకోవాల్సిన దుస్థితి. ఇక వాగులు ప్రవహించిన సమయంలో ఆయా గ్రామాల రైతులు పొలాలకు వెళ్లలేకపోతున్నారు. దీంతో వ్యవసాయ పనులు నిలిచిపోతున్నాయి. గత ప్రభుత్వంలో ఆ దారిలో మట్టి రోడ్డు నిర్మించారు. వారం రోజులుగా కురిసిన వర్షాలకు రోడ్డు కొట్టుకుపోయింది.దీంతో రాక పోకలు నిలిచి పోయాయి.



తక్కువ ఎత్తులో ఉన్న ఏరూరు-దేగుల హాలు మధ్య బ్రిడ్జి

ప్రతి పాదనలు సిద్ధం చేస్తున్నాం

మండలంలోని గ్రామాల్లో అవసరమున్న వంకలపై, గ్రామీణ రహదారుల్లో బ్రిడ్జీల నిర్మాణానికి ప్రతి పాదనలు సిద్ధం చేస్తున్నాం. నివేదిక రూపొందించి సంబంధిత శాఖ అధికారులకు పంపుతాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే నిర్మాణాలు చేపడతాం.

– భాస్కర్..పీఆర్ డీఈ (పీఐయూ)

వ్యవసాయ పనులకు వెళ్లలేక పోతున్నాం



వంకపై బ్రిడ్జి లేని కారణంగా అటు వైపు ఉన్న పొలాలకు కనీసం వ్యవసాయ పనులకు కూడా వెళ్లలేక పోతున్నారు. వరద ఉధృతి ఎక్కువగా ఉంటుండంతో కనీసం ఎడ్లబండ్లు కూడా వెళ్లలేవు. అత్యవసరమైతే 10 కి.మీ. తిరిగి వెళ్లాలి. బ్రిడ్జీ నిర్మిస్తే రెండు గ్రామాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.

– సేనాపతి ఏరూరు

బ్రిడ్జీ ఎత్తులో నిర్మించాలి



దేగులహాలు – ఏరూరు మధ్యనున్న వంకపై ఏళ్ల క్రితం బ్రిడ్జి నిర్మించారు. అయితే అది తక్కువ ఎత్తులో ఉండటంతో వర్షం వచ్చిన ప్రతిసారీ వంతెనపై నీరు ప్రవహిస్తుంది. ఆ సమయంలో రాకపోకలు నిలిచిపోతాయి. బ్రిడ్జికి ఇరు వైపులా రక్షణ గోడలు కూడా లేవు. తక్షణమే వంతెన ఎత్తు పెంచి, రక్షణ గోడలు నిర్మించాలి.

– జూటూరు మారయ్య,దేగులహాలు

గ్రామంలోకి వెళ్లలేం



భారీ వర్షాలు కురిస్తే గ్రామంలోకి వెళ్లలేం. ఎగువన కురిసిన వర్షం నీరు ఈ వంకలో కి కలుస్తుండటంతో ఉధృతి ఎక్కువగా ఉంటుంది. వరద వచ్చేలోపు ఇళ్లకు చేరుకోవాల్సిందే. లేకపోతే వాగు అవతల ఉండిపోవాల్సి వస్తుంది. అత్యవసర పరిస్థితి ఎదురైతే మా అవస్థలు వర్ణనాతీతం.

– శేఖర్ రామదుర్గం

పంట నమోదు తప్పనిసరి

మద్దికెర : ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలను ఈనెల 15వ తేదీ లోపు పంటల నమోదు చేయించాలని ఏఓ రవి ఆదివారం తెలిపారు. రైతులు వ్యవసాయాధికారులకు సహకరించి సాగు చేసిన పంటల వివరాలుతో పాటు పట్టాదారు పాస్‌బుక్, 1 బీ, ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులను అందజేయాలని సూచించారు. ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకున్న రైతులు ఈ-కేవైసీ కూడా చేయించుకోవాలని చెప్పారు.

రేపు ఆలూరులో జాబ్ మేళా

ఆలూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఈనెల 3వ తేదీన నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, నియోజకవర్గ సమన్వయకర్త వీరేష్ ఆదివారం తెలిపారు. నిరుద్యోగ, యువతీ, యువకులు ఇంటర్, డిగ్రీ, పీజీ, చదివి 18 నుంచి 35 ఏళ్ల లోపు ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హాజరయ్యే వారు ఆధార్ కార్డు, రెండు పాస్‌ఫొటోలు, ఒరిజినల్ విద్య అర్హత పత్రాలతో రావాలని చెప్పారు.

ఆస్పరి కూరగాయల మార్కెట్ ప్రారంభం

ఆస్పరి: స్థానిక దినసరి కూరగాయలు మార్కెట్ ఆదివారం ప్రారంభమైంది. మార్కెట్లో కంట్రాక్టర్ కట్టెల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దొర బాబు, రైతులు వెంకటరాముడు, తిమ్మప్ప, ప్రకాష్, రామకృష్ణ, మహేష్, నరసింహ పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

పత్తికొండ(తుగ్గలి) : గణేష్ ఉత్సవాలకు ఆన్‌లైన్‌లో అనుమతులు తీసుకోవాలని పట్టణ సీఐ జయన్న ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వినాయక ఉత్సవాల నిర్వహణ, మండపాల ఏర్పాటు, ఊరేగింపులు, నిమజ్జనానికి మీ సేవలో చలానా రూపంలో రుసుం చెల్లించి నిరభ్యంతర పత్రం, క్యూ ఆర్ కోడ్ పొందాలని సూచించారు. సింగిల్‌విండో విధానంలో వివరాలు పూర్తిచేసి అనుమతులు పొందాలన్నారు. వాటిని ఉత్సవాల పందిరి వద్దకు తనిఖీలకు వచ్చే అధికారులకు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు.

దరఖాస్తు ఇలా..

గణేష్ ఉత్సవ్ డాట్ నెట్ ఓపెన్ చేసి న్యూ అప్లికేషన్‌పై క్లిక్ చేయాలి. దరఖాస్తు చేస్తున్న వ్యక్తి ఫోన్ నంబర్ ఎంటర్ చేస్తే ఓటీపీ వస్తుంది. తర్వాత మొబైల్ నంబర్ వెరిఫికేషన్ పూర్తయి విండో ఓపెన్ అవుతుంది. దరఖాస్తు ఫారంలో దరఖాస్తుదారు పేరు, ఈ-మెయిల్ ఐడీ, అడ్రస్, అసోసియేషన్ పేరు, ఉత్సవం నిర్వహిస్తున్న స్థలం, గణపతి విగ్రహం, మండపం ఎత్తు వివరాలు నమోదు చేయాలి. ఉత్సవ కమిటీ సభ్యులు, వారి ఫోన్ నంబర్లు, నిమజ్జనం తేదీ, సమయం, వాహన వివరాలు నమోదు చేయాలి. ఆన్‌లైన్‌లో సూచించిన మొత్తాన్ని మీ సేవలో చలానా కట్టి అప్లికేషన్ స్టేటస్‌లో నేవిగేట్ అయి, దరఖాస్తుదారుని ఫోన్ నంబర్ ఎంటర్ చేస్తే అనుమతులు మంజూరు చేస్తూ నిరభ్యంతర పత్రం, పాటించవలసిన నిబంధనలతో కూడిన క్యూఆర్ కోడ్ డౌన్‌లోడ్ అవుతుంది.

మాంసం విక్రయాలను నిషేధించాలి

దేవనకొండ: మండల కేంద్రంలో ఆగస్టు 9న చెన్నకేశవస్వామి ధ్వజ స్తంభం, శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి విగ్రహం, ధ్వజస్తంభం ప్రతిష్ఠోత్సవాలు చేపట్టామని 41 రోజులపాటు గ్రామంలో మాంసం విక్రయాలు జరగకుండా చూడాలని గ్రామస్తులు ఆదివారం ఏఎస్ఐకు వినతి పత్రం అందజేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ట సందర్భంగా గ్రామంలో శాంతి నెలకొనాలని, అంతా మంచే జరగాలని గ్రామస్తుల తీర్మానం మేరకు 41 రోజులపాటు అంటే ఈనెల 18వ తేదీ వరకు మాంసం విక్రయాలు జరగకూడదని తీర్మానం చేశామని చెప్పారు. అయితే కొందరు తీర్మానాన్ని ధిక్కరించి మాంసం విక్రయాలు చేస్తూ సంప్రదాయాలను మంటగలుపుతున్నారని వాపోయారు. వెంటనే విక్రయాలను నిషేధించాలని కోరారు.

కౌలుట్ల చెన్నకేశవస్వామి సన్నిధిలో..



ఆలయ ఆవరణలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టులో వెలసిన శ్రీదేవి,భూదేవి,సమేత కౌలుట్ల చెన్నకేశవస్వామి వారిని మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి దంపతులు, మంత్రాలయం ఎంపీపీ వై.గిరిజమ్మ, మంత్రాలయం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ వై.ప్రదీప్‌రెడ్డి, గుంతకల్ మాజీ ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి భార్య, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి కుమారుడు వై.భీమిరెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. వారికి ఆలయ చైర్మన్ ఆర్.హనుమంతరెడ్డి, పార్టీ మండల నాయకులు కప్పట్రాళ్ల దివాకర్‌నాయుడు స్వాగతం పలికారు. పూజల అనంతరం వారిని సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి మాట్లాడుతూ మా ఇలవేల్పు కౌలుట్ల చెన్నకేశవస్వామి అని, యేటా రెండు నుంచి మూడు సార్లు స్వామివారిని దర్శించుకుంటామని చెప్పారు. ఆలయ అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టు బోర్డు మెంబర్ ఆర్.వెంకటేశ్వరరెడ్డి, పండితులు పులికొండస్వామి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వెల్దుర్తి సీహెచ్‌సీలో చిన్నారుల పరిస్థితిని పరిశీలిస్తున్న జిల్లా ఇన్‌చార్జ్ డీఎంఅండ్‌హెచ్‌ఓ భాస్కర్

వెల్దుర్తి: వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఆసుపత్రిలోని వైద్యులు మెరుగైన వైద్యం అందివ్వాలని, అవగాహన కల్పిస్తూ బాధ్యతతో వ్యవహరించాలని జిల్లా ఇన్‌చార్జ్ డీఎంఅండ్‌హెచ్‌ఓ భాస్కర్ సూచించారు. ఆదివారం ఆయన స్థానిక సీహెచ్‌సీ (కమ్యూనిటీ హెల్త్ సెంటర్–సామాజిక ప్రభుత్వ ఆసుపత్రి)ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో చికిత్స అందుకుంటున్న వారి ఆరోగ్య పరిస్థితిని స్వయంగా పరిశీలించి తెలుసుకున్నారు. వైరల్ ఫీవర్‌తో చికిత్స పొందుతున్న చిన్నారులను పరిశీలించి, తల్లితండ్రులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేడి భోజనం, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ దోమలను నివారించుకోవాలని సూచించారు. జ్వర లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలని కోరారు. సీహెచ్‌సీ వైద్యులు రంగస్వామి, ధరణి, రామళ్లకోట, గోవర్ధనగిరి పీహెచ్‌సీల వైద్యాధికారులు భువన్‌తేజ, నవీన్, సీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ వర్ధంతి

హాలహర్వి: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 15వ వర్ధంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ హెచ్.రామిరెడ్డి ఆదివారం తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆలూరు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం అన్ని మండల కేంద్రాల్లో వైఎస్సార్ విగ్రహాల వద్ద నివాళులర్పించాలని ఎమ్మెల్యే బి. విరూపాక్షి ఆదివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద జరిగే వేడుకల్లో ఆయన పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

అధిక వర్షాలు కురుస్తున్న కారణంగా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే బి. విరూపాక్షి ప్రజలను కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు వంకలు, వాగులు, ఉప్పొంగి ప్రవహిస్తున్నాయని, ప్రజలు అధికారుల సూచనలు పాటించాలని చెప్పారు. చెట్లు, విద్యుత్ స్తంభాల సమీపంలో ఉండొద్దన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు శుద్ధి చేసిన నీటిని గ్రామాలకు విడుదల చేయాలని సూచించారు.

మద్దికెర : మండల కేంద్రంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి వేడుకలను సోమవారం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.





హొళగుంద తేరు బజారులో వర్షపు నీరు నిలిచి మురుగు గుంతలా మారిన దృశ్యం

వర్షం వస్తే చెరువులా మారిన హొళగుంద తేరుబజారు (ఫైల్)

మురుగు కుంటలా తేరుబజారు!

హొళగుంద: స్థానిక సిద్ధేశ్వరస్వామి తేరుబజారు దుర్గంధం వెదజల్లుతోంది. రోజుల తరబడి నిలిచిన వర్షపు నీరు, పరిసరాల్లో ఉంటున్న వారు అక్కడే వేస్తున్న చెత్త చెదారంతో ఆ ప్రాంతం డంప్ యార్డ్‌ను తలపిస్తోంది. ఆలయ సమీపంలో పారిశుద్ధ్యం లోపించడంపై గ్రామస్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇక వర్షం వచ్చిందంటే నీరు వెళ్లే మార్గం లేక ఆ ప్రాంతమంతా చెరువును తలపిస్తుంది. వర్షపు నీరు ఎగువ భాగం నుంచి వచ్చి తేరుబజారులో నిలిచిపోతుండటమే ఇందుకు కారణం. దీనికి తోడు ఆ ప్రాంతంలో వేసి చెత్తచెదారం కుప్పలుగా ఉండటంతో నీరు ముందుకు కదలడానికి వీలులేకుండా పోతుంది. వర్షం ఆగిపోయినా రెండు మూడు రోజుల పాటు తేరుబజారు ప్రాంతంలో నడవడానికి సాధ్యం కాదని స్థానికులు పేర్కొంటున్నారు. గ్రామంలోని నీరు ఆ ప్రాంతంలోకి ప్రవహించకుండా చర్యలు తీసుకొని, పారిశుద్ధ్య పనులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి



పత్తికొండలో మాట్లాడుతున్న రామచంద్రయ్య

పత్తికొండ(తుగ్గలి) : రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించేలా చట్టం తీసుకురావాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పి.రామచంద్రయ్య డిమాండ్ చేశారు. రైతు కోర్కెల దినోత్సవం సందర్భంగా ఆలిండియా కిసాన్ సభ జాతీయ సమితి పిలుపు మేరకు ఆదివారం పట్టణంలోని కొండగేరిలో రైతు సంఘం జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. అన్నదాతలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని విమర్శించారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించక దేశవ్యాప్తంగా 3.50 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దూదేకొండలో రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు పెద్ద ఈరన్న, పెద్దహుల్తిలో గౌరవ అధ్యక్షుడు కారన్న జెండాను ఆవిష్కరించారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాజాసాహెబ్, పట్టణ కార్యదర్శి రామాంజినేయులు, సహాయ కార్యదర్శి సుంకన్న, నాయకులు నాగిరెడ్డి, రామచంద్ర, శ్రీరాములు, రవి, రైతులు పాల్గొన్నారు.

వెల్దుర్తి: అధిక వర్షాల వల్ల నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి టి కృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన రైతు సంఘం మండల నాయకుడు డి రాజు, ఆటో యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి ఏసన్నతో కలిసి పార్టీ కార్యాచరణలో భాగంగా డిమాండ్స్ డే నిర్వహించారు. పార్టీ కార్యాలయం ముందు రైతు సంఘం జెండా ఆవిష్కరించారు.

దేవనకొండ: స్వామినాథన్ కమిషన సిఫారసు మేరకు పంటలకు కనీస మద్దతు ధరల చట్టాన్ని అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వం రూపొందించిన విద్యుత్ చట్టం–2022 తక్షణమే ఉపసంహరించుకోవాలని ఏపీ రైతు సంఘం మండల గౌరవాధ్యక్షుడు వై.కందప్ప, సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి ఎం.నరసారావు డిమాండ్ చేశారు. ఆదివారం రైతాంగ కోర్కెల దినోత్సవం సందర్భంగా సీపీఐ కార్యాలయం ఎదుట రైతు సంఘం పతాకావిష్కరణ గావించారు.

ఆస్పరి: రైతుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి విరుపాక్షి ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. రైతుల కోర్కెల దినోత్సవం సందర్భంగా రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని బిల్లేకల్లు గ్రామంలో రైతు సంఘం జెండాను ఆవిష్కరించారు. బ్రహ్మయ్య, కృష్ణమూర్తి, ఉరుకుందప్ప, నాగరాజు, మల్లారెడ్డి పాల్గొన్నారు.

హొళగుందలో 'ఖత్ముల్ ఖురాన్ మజ్లిస్'

హొళగుంద: స్థానిక రివా పాఠశాలలో ఆదివారం నూర్‌బాషా దూదేకుల కులస్తుల ఆధ్వర్యంలో అహెక్ ఫౌండేషన్ ఆంధ్రప్రదేశ్, నూరానీ జామీయా మజీద్ సంయుక్త ఆధ్వర్యంలో అల్ ఫుర్ఖాన్–24 వార్షిక ఖత్ముల్ ఖురాన్ మజ్లిస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి అహెక్ ఫౌండేషన్ ఆంధ్రప్రదేశ్ మేనేజింగ్ డైరెక్టర్ మౌలానా షంషుద్దీన్ సఖాఫీ, మజీద్ నిర్వాహకులు హుసేన్ పీరా, సాయిబేష్, దాదావలి, సాబ్జాన్, బడేసాబ్, రహిమాన్, మదర్సా సహాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

సీపీఎస్ రద్దు చేయాలి



పత్తికొండలో ధర్నా చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

పత్తికొండ(తుగ్గలి) : కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్) రద్దు చేసి, పాత పెన్షన్ విధానం తీసుకురావాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని నాలుగు స్తంభాల కూడలిలో సంఘం నాయకులు ధర్నా చేశారు. ఏపీ పీఈటీ, ఎస్ఏ పీఈ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చందునాయక్ మాట్లాడారు. పెండింగ్ డీఏ చెల్లించడంతో పాటు ఐఆర్ ప్రకటించాలన్నారు. అసంబద్ధంగా, అశాస్త్రీయ విధానాలతో చేపట్టిన టీచర్ల పనిసర్దుబాటు ప్రక్రియను వెంటనే రద్దు చేయాలన్నారు. సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్‌లను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు రంగారెడ్డి, సంజీవ్, పరమేష్, గోవిందునాయక్, లోక్యానాయక్, వెంకటేష్‌నాయక్, విష్ణు, మధు, హనుమన్న, శేఖర్, జయరాం, వన్నూరప్ప, శేషు, భాస్కర్, గౌస్‌బాషా పాల్గొన్నారు.

వీడని వాన



లక్కసాగరం సమీపంలో వర్షానికి నల్లగా మారిన వేరుశనగ పంట

తుగ్గలి : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారిన నేపథ్యంలో ఎడతెరిపిలేకుండా వర్షం కురుస్తోంది. వర్షంతో జనం ఇళ్ల నుంచి బయటకు వెళ్లపోతున్నారు. వర్షాలకు జొన్నగిరిలో మూడు, ఉప్పర్లపల్లిలో ఒక మట్టిమిద్దెలు కూలిపోయాయి. ఇప్పటికే కోతకొచ్చిన సజ్జ పంట, మరి కొద్ది రోజుల్లో చేతి కందనున్న వేరుశనగ పంట దెబ్బ తింటుందేమోనని రైతులు దిగాలు చెందుతున్నారు. వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసి అధికారులను అందుబాటులో ఉంచారు. వర్షాల వల్ల ఎటువంటి ఇబ్బంది ఏర్పడినా రోడ్లు తెగినా, చెట్లు కూలినా, మరే ఇతర అవసరమైనా వెంటనే కంట్రోల్ రూంలకు కేటాయించిన ఫోన్ నంబర్లకు ప్రజలు ఫోన్ చేయాలని రెవెన్యూ అధికారులు కోరారు.

వర్షానికి దెబ్బతిన్న పంటలు

కృష్ణగిరి: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటలు దెబ్బతింటున్నాయి. ముందస్తుగా సాగు చేసిన వేరుశనగ పంటను నూర్పిళ్లు చేస్తున్న సమయంలో ఒక్కసారిగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో పంట నల్లగా మారింది. అలాగే ఆముదం, కంది పంట పొలాల్లో తడి ఎక్కువై పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోరు, బావుల కింద సాగు చేసిన వేరుశనగ పంటలు నూర్పిళ్లు చేస్తున్న సమయంలో ఇలా వర్షం వస్తుండటంతో చేతికి వచ్చిన పంట దెబ్బతిని నష్టం కలిగే పరిస్థితి నెలకొందని ఆందోళన చెందుతున్నారు.



ఉప్పర్లపల్లిలో కూలిపోయిన పాత మట్టిమిద్దె

భక్తి శ్రద్ధలతో శ్రీకృష్ణాష్టమి వేడుకలు



కోయిలకొండలో భక్తుల మధ్య శ్రీకృష్ణుడి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



కృష్ణుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

కృష్ణగిరి: మండలంలోని కోయిలకొండ గ్రామంలో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఆదివారం ఉదయం శ్రీకృష్ణ, రుక్మిణి, సత్యభామ కల్యాణాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం నూతనంగా చేయించిన రథంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఉంచి ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామంలో ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

దేవనకొండ: మండలంలోని పి.కోటకొండ గ్రామంలో ప్రభోనాందస్వామి సేవాసమితి ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించా. శ్రీకృష్ణుడి విగ్రహాన్ని పల్లకీలో ఉంచి ఊరేగించారు. చిన్నారులు, పెద్దల కోలాటాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రేపు 'పొలం పిలుస్తోంది'

పత్తికొండ(తుగ్గలి) : ఈనెల 3వ తేదీన పొలం పిలుస్తోంది కార్యక్రమం ప్రారంభించనున్నట్లు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు మోహన్ విజయకుమార్ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రతి వారం మంగళ, బుధవారం రెండు రోజుల పాటు గ్రామాల చొప్పున వ్యవసాయ, అనుబంధ విభాగాల అధికారులు, సిబ్బంది పొలాలను సందర్శించి గ్రామ సభలు నిర్వహిస్తారని చెప్పారు.